పోస్టాఫీసుల్లో అమ్మకానికి జాతీయ జెండాలు

శ్రీకాకుళం అర్బన్ : ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయడం ద్వారా ప్రజల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం గతేడాది నిర్వహించిన హర్ ఘర్ తిరంగా విజయవంతం నేపథ్యంలో, ఈ ఏడాదీ పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, శ్రీకాకుళం హెడ్ పోస్టుమాస్టర్ డి.చంద్రశేఖర్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని పోస్టాఫీసుల్లో పది వేల జాతీయ జెండాలను అమ్మకానికి ఉంచినట్లు పేర్కొన్నారు. అత్యుత్తమ నాణ్యతతో కూడిన జాతీయ జెండాలను రూ.25కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలను కొనుగోలు చేసి ఇంటిపై అమర్చుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి పోస్టల్ కార్యాలయంలో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నామని, వీటి ద్వారా నాడు, నేడు అందిస్తున్న పోస్టల్ సేవలను ప్రజలకు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

పంట నమోదుకు జియోట్యాగింగ్

- ఈ-క్రాప్‌లో కొత్త విధానం
- బుకింగ్‌కు రైతు అందుబాటులో ఉండాల్సిందే
- రోజుకు ఆరు ఎకరాలు నమోదు
- వలస రైతులకు తప్పని ఇబ్బందులు

ఖరీఫ్ సాగు ఒకవైపు సాగుతుండగా, మరోవైపు అధికారులు ఈ-క్రాప్ నమోదుకు వ్యవసాయశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. పంటల కొనుగోలు, వరదలు, తుపాన్ల సమయంలో ఇన్సూరెన్స్ తదితర సౌకర్యాల వర్తింపునకు ఈ-క్రాప్ తప్పనిసరి అని అధికారులు చెప్తున్నారు. మూడేళ్లుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ఏడాది ఈ-క్రాప్ బుకింగ్‌లో ప్రభుత్వం కొత్త మార్పు తీసుకొచ్చింది. గతంలో రైతు సాగు చేసిన పంటకు మాత్రమే ఫొటో అప్‌లోడ్ చేయగా, కొత్త విధానంలో పొలంలో రైతు ఉంటుండగా ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కొత్త పద్ధతిలో రైతులతో పాటు అగ్రికల్చర్ అసిస్టెంట్లు (విఎఎ), విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లకు (విహెచ్ఎ) ఇబ్బందిగా పరిణమించడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,37,165 ఎకరాల సాగు లక్ష్యంగా నిర్దేశించుకోగా 2,05,758 ఎకరాల్లో పంటలు వేశారు. వరి పంటను 3,98,750 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా, ఇప్పటివరకు 1,80,458 ఎకరాల్లో సాగైంది. మొక్కజొన్న పంట సాగు లక్ష్యం 26,375 ఎకరాలు కాగా, ఇప్పటివరకు 16,163 ఎకరాల్లో వేశారు. చెరుకు పంటను 4,550 ఎకరాల్లో వేయాలని నిర్ణయించగా, 1085 ఎకరాల్లో సాగవుతోంది. పత్తి పంటను 4,620 ఎకరాల్లో వేయాల్సి ఉండగా 2,210 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కందులు 73 ఎకరాలు, వేరుశనగ 1333 ఎకరాల్లో సాగవుతోంది. పంటల సాగు ప్రారంభించి రెండు నెలలు కావడంతో, అధికారులు ఈ-క్రాప్‌కు నమోదు మొదలుపెట్టారు. ప్రభుత్వం ఈ సంవత్సరం కొత్తగా తీసుకొచ్చిన విధానానికి అనుగుణంగా అధికారులు ఈ-క్రాప్ ప్రక్రియ ప్రారంభించారు. ప్రతి పంటకూ జియోట్యాగింగ్ చేయాల్సిందేనని నిబంధన తెచ్చింది.

అవకతవకలకు చెక్ చెప్పేందుకేనా?

ఒక విఎఎ రోజుకు ఆరు ఎకరాల వరకు జియోట్యాగింగ్ చేయాలని స్పష్టం చేసింది. దీంతో తమపై తీవ్ర పనిభారం పడుతోందని వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రతి సర్వే నంబరుకు, అదేవిధంగా ఆయా సర్వే నంబర్లలోని సబ్ డివిజన్లకు వెళ్లి జియోట్యాగింగ్ ద్వారా ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారు. గతంలో కార్యాలయాల్లో కూర్చొని రైతులు తీసుకొచ్చిన పట్టాదారు పాసు పుస్తకాలు, వన్-బి ద్వారా పంట నమోదు చేసే పరిస్థితి ఉండేది. సిగ్నల్ లేని చోట, కొండల పైకి వెళ్లలేని సందర్భంలో రైతులు అందించే వివరాలతో ఈ-క్రాప్ చేసే వెసులుబాటు ఉండేది. అధికార పార్టీ నేతల ఒత్తిడితో సాగు చేయని పంటలకూ ఈ-క్రాప్ చేయించడం, ఒక పంట వేస్తే మరో పంట నమోదు చేయడం వంటి అవకతవకలు చోటుచేసుకునేవి. పంట వేయకపోయినా ఇన్సూరెన్స్, ఇతర సౌకర్యాలు దక్కించుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. క్షేత్రస్థాయికి వెళ్తే గానీ పని జరిగే అవకాశం లేదు. పొలాలకు వెళ్లి పంట వివరాలు, రైతు ఫొటోలను తీసి అప్‌లోడ్ చేస్తే గానీ జియోట్యాగింగ్ పూర్తయ్యే పరిస్థితి లేదు. దీంతో విఎఎలు, విహెచ్ఎలు కొంత పనిఒత్తిడికి లోనవుతున్నారు.

యాప్‌లో లోపాలతో సమస్యలు

పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో సాంకేతిక సమస్యలు తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అంతా ఒకేసారి ప్రయత్నిస్తుండడంతో సర్వర్ సమస్యలు తలెత్తుతున్నట్లు సిబ్బంది చెప్తున్నారు. పైగా కొన్నిచోట్ల సిగ్నల్స్ లేకపోవడంతో అప్‌లోడ్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. యాప్‌లో లోపాలతో జియోట్యాగింగ్ సరిగా జరగడం లేదంటూ ఆందోళన చెందుతున్నారు.

ఆమదాలవలస : అక్కులపేటలో జియోట్యాగింగ్ చేస్తున్న సిబ్బంది

రైతులకూ పాట్లే

ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానంతో అటు రైతులకూ ఇబ్బందులు తప్పడం లేదు. భూములను కౌలుకు ఇచ్చి వలస వెళ్లిన వారికి ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో వారు రాకుండానే పంట ఈ-క్రాప్‌లో నమోదయ్యే పరిస్థితి ఉండేది. జియోట్యాగింగ్ పద్ధతిలో వారు తప్పనిసరిగా రావాల్సి వస్తోంది. పంటను ఏదో విధంగా అమ్ముకుందామనుకున్నా, ఈ-క్రాప్ చేయించకపోతే ఇన్సూరెన్స్ వచ్చే పరిస్థితి లేకపోవడంతో కొందరు సొంత గ్రామాలకు వస్తున్నారు. భూమిని కౌలుకి ఇచ్చిన వారు మాత్రం రావడానికి ఇష్టపడడం లేదు.

జియోట్యాగింగ్ తప్పనిసరి

పంటల కొనుగోలు, ఇతర ప్రయోజనాలన్నీ నిజంగా సాగు చేస్తున్న రైతులకే దక్కాలనే ప్రభుత్వం జియోట్యాగింగ్ విధానం తీసుకొచ్చింది. ఈ సంవత్సరం పంటతో పాటు పొలంలో రైతు ఉన్నట్లు ఫొటో తీసి జియోట్యాగింగ్ చేస్తున్నాం. రైతులంతా తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలి.

- కె.శ్రీధర్, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు

మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

టిడిపి, జనసేన భూస్థాపితం ఖాయం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - రణస్థలం

వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలు భూస్థాపితం కావడం ఖాయమని రాష్ట్ర విద్యాశాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఎన్నికల తర్వాత ఆ పార్టీలు దుకాణం సర్దుకోవాల్సిందేనన్నారు. మండల కేంద్రంలో గడప గడపకు మన ప్రభుత్వం విజయోత్సవ సభను ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల పాటు పరిపాలించిన చంద్రబాబు నాయుడు ఒక్కసారైనా వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో కొన్నింటినైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలతో డబ్బులను వృథా చేస్తున్నారని గగ్గోలు పెట్టిన ఆయన, అవే పథకాలను తామూ అమలు చేస్తామని చెప్తున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఎన్ని హామీలు ఇచ్చినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఒకవైపు తండ్రి, మరోవైపు కొడుకు లోకేష్, ఇంకోవైపు దత్త పుత్రుడు పవన్ కళ్యాణ్ తిరుగుతూ అర్థం పర్థం లేని ప్రసంగాలు చేస్తున్నారన్నారు. పవన్ కళ్యాణ్ పిచ్చి ప్రేలాపనలతో ప్రజలకు మరింత దూరమవుతున్నారే గానీ, దగ్గర కాలేకపోతున్నారని చెప్పారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి గానీ నోరు పారేసుకుంటే ప్రజల్లో గౌరవం దెబ్బతింటుందని హితవు పలికారు. ప్రజల వద్దకు నేరుగా వెళ్లి వారికి అందిన సంక్షేమాన్ని వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే గడప గడపకు మన ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు.

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు కళ్లుగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సంక్షేమ కేలండర్‌ను విడుదల చేసి తూచ తప్పకుండా నిర్దేశించిన తేదీకే బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తోందని చెప్పారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకే పథకాలు అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వంద గ్రామ సచివాలయల పరిధిలోని 93,047 కుటుంబాలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. సభలో వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, నియోజకవర్గ పరిశీలకులు ఎన్.నాయుడు బాబు, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న నారాయణమూర్తి

ర్యాంకుల కోసం పేపర్ లీకులు

సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి

ప్రజాశక్తి - టెక్కలి

విద్య ప్రైవేటీకరణ వల్ల సంస్థల మధ్య పోటీ పెరిగి, ర్యాంకుల కోసం పేపర్ లీకేజీ వంటి అక్రమాలకు పాల్పడుతున్నారని సినీనటుడు, దర్శక, నిర్మాత ఆర్.నారాయణమూర్తి అన్నారు. దీనివల్ల యువత నష్టపోవడమే కాకుండా మనోధైర్యం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. టెక్కలిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రణవి కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, శ్రీవిద్య జూనియర్ కళాశాలలో విద్యార్థులతో శుక్రవారం ఆయన ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను ప్రైవేటీకరణ చేయడం వల్ల కలిగే దుష్ఫలితాలు ఇతివృత్తంగా 'యూనివర్సిటీ' సినిమాను తెరకెక్కించినట్లు తెలిపారు. స్థానిక నటీనటులతో విద్యార్థులు, యువతకు ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణతో వాటిల్లుతున్న నష్టాన్ని కళ్లకు కట్టినట్లు ఈ చిత్రంలో చూపామన్నారు. ఈ సినిమాను ఆదరించాలని కోరారు. అభ్యుదయవాదులు విద్యాసంస్థలను నెలకొల్పినా, కార్పొరేట్ సంస్థల పోటీని తట్టుకోలేకపోతున్నాయన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా చైతన్యం కావల్సిన యువత వాటి ద్వారానే నిర్వీర్యమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పి.బి దేవి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, డైరెక్టర్ పేడాడ చంద్రశేఖర్ ఆజాద్, కార్యదర్శి పి.సూర్యనారాయణ, ఆర్.వెంకటరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సతీష్‌కుమార్, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

5.91 లక్షల మందికి 'సున్నా వడ్డీ' లబ్ధి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సున్నా వడ్డీ పథకం ద్వారా మహిళలకు ఆర్థికంగా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. నగరంలోని అంబేద్కర్ కళావేదికలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ సున్నా వడ్డీ కింద పొదుపు సంఘాల సభ్యులకు రూ.69.50 కోట్ల నమూనా చెక్కును నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2021-22 ఆర్థిక సంవత్సరంలో సకాలంలో వాయిదా చెల్లించిన అన్ని సంఘాలకు సున్నా వడ్డీ వర్తిస్తుందని తెలిపారు.

సంఘం అప్పు నిల్వలో రూ.మూడు లక్షల వరకు సున్నా వడ్డీ వర్తిస్తుందన్నారు. క్యాష్ క్రెడిట్ లిమిట్ ద్వారా అప్పు పొందిన సంఘాలు ప్రతి నెలా, గత నెలాఖరు నాటికి ఉన్న అప్పు నిల్వల్లో కనీసం మూడు శాతం ప్రస్తుత నెలలో చెల్లించి ఉండాలన్నారు.

వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వమే నేరుగా స్వయం సహాయక సంఘం అప్పు ఖాతాకు జమ చేస్తుందని తెలిపారు. ఒకవేళ ఇప్పటికే అప్పు పూర్తిగా చెల్లించి ఖాతా క్లోజ్ అయితే సంఘం పొదుపు ఖాతాకు జమ చేయడమవుతుందని వివరించారు. జిల్లాలో 45,954 సంఘాల్లో ఉన్న 5,91,923 మంది సభ్యుల ఖాతాల్లో రూ.69.50 కోట్లు జమ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, పొందర కూరాకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ హైమావతి, మెప్మా పీడీ కిరణ్, ఎల్‌డిఎం సూర్యకిరణ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

18 నాటికి శతశాతం ఓటర్ల సర్వే పూర్తి

- వాలంటీర్ల పాత్ర ఉండకూడదు
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లావ్యాప్తంగా చేపడుతున్న ఓటర్ల నమోదులో భాగంగా కొనసాగుతున్న ఇంటింటి సర్వేను ఈ నెల 18వ తేదీ నాటికి శత శాతం పూర్తి కావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో మున్సిపల్ కమిషనర్లు, ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు, బిఎల్‌ఒలు, సూపర్‌వైజర్లతో శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 21న ప్రారంభమైన ఇంటింటి సర్వే ఈనెల 21వ తేదీతో ముగుస్తుందన్నారు. ఇప్పటివరకు యాప్‌లో 32 శాతం మాత్రమే సర్వే పూర్తయినట్లు నమోదైందని, మిగిలిన జిల్లాల్లో 80 శాతం వరకు పూర్తి చేశారని చెప్పారు. అందువల్ల జిల్లాలోనూ మిగిలి ఉన్న సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. యాప్‌లో సాంకేతికపరమైన లోపాలను సరిదిద్దుకుని పూర్తి చేయాలన్నారు. ప్రతిరోజూ వేకువజామున, సాయంత్రం వేళల్లో యాప్ బాగా పనిచేస్తుందని, ఆ సమయాల్లో బిఎల్‌ఒలు పనిచేసి లక్ష్యాలను సాధించాలని సూచించారు. లక్ష్యాలను పూర్తి చేయడానికి పది రోజుల గడువు మాత్రమే ఉండడంతో పనిలో వేగం పెంచాలన్నారు. యాప్ పరంగా కొంత తక్కువగా నమోదు ఉన్నా, ఫిజికల్‌గా ఈనెల 18వ తేదీ నాటికి శతశాతం సర్వే పూర్తి కావాలన్నారు. సర్వే పరంగా టెక్కలి నియోజకవర్గం అన్నిటికంటే వెనుకంజలో ఉందని, అక్కడ 57 శాతం మాత్రమే సర్వే ఫిజికల్‌గా పూర్తి చేశారని చెప్పారు. సారవకోట, కోటబొమ్మాళి, సంత బొమ్మాళి మండలాల్లో సర్వే సక్రమంగా కావడం లేదన్నారు. సక్రమంగా పనిచేయని బిఎల్‌ఒలను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. సెలవు రోజుల్లోనూ సర్వే చేసి పూర్తి చేయాలన్నారు. గారలో 13 శాతం మాత్రమే సర్వే పూర్తయినట్లు ఆన్‌లైన్‌లో కనిపిస్తుందని, పనితీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. జిల్లాలో జరిగిన 90 వేల తొలగింపు ఓటర్లను మరోమారు పరిశీలించాల్సి ఉందన్నారు. తొలగింపునకు తగిన ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. డాక్యుమెంటేషన్ సరిగా లేని బిఎల్‌ఒలపై చర్యలు తప్పవన్నారు. శతశాతం పరిశీలన అనంతరం ఈనెల 28న బిఎల్‌ఒలు రిపోర్టులు సమర్పించాలన్నారు. 29న ఎఇఆర్‌ఒలు, 30న ఇఆర్‌ఒలు రిపోర్టులు సమర్పించాల్సి ఉందన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పక పాటించాలని, జాబితాలు రూపొందించడంలో పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. బిఎల్‌ఒలతో పాటు వాలంటీర్ల పాత్ర ఎక్కడా కనిపించకూడదని, వారి సహకారం తీసుకున్నట్లు ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇఆర్ఒ, ఎఇఆర్‌ఒలు రాజకీయ పార్టీలతో సమావేశాలను నిర్వహించాలని సూచించారు. వారికి చేర్పులు, తొలగింపులు, మార్పుల వివరాలు అందజేసినట్లుగా సంతకాలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

నిర్వాసితులను మోసం చేసింది చంద్రబాబే

రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, అర్బన్

వంశధార నిర్వాసితులను మోసం చేసింది చంద్రబాబేనని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వంశధార నిర్వాసితుల యూత్ ప్యాకేజీ కోసం 2016 జూలైలో చంద్రబాబు ప్రభుత్వం జిఒ విడుదల చేసిందని, భూసేకరణ చట్టం అమల్లో ఉన్నా, ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. వంశధార నిర్వాసితులను చంద్రబాబు ఏవిధంగా మోసం చేశారో జిల్లా ప్రజలకు తెలుసునన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రూ.216 కోట్లను మంజూరు చేశారని చెప్పారు. నిర్మాణం జరుగుతున్న ఒక ప్రాజెక్టులో భూసేకరణ చట్టం అమలు చేస్తే అన్ని ప్రాంతాల నిర్వాసితుల నుంచి అదే రకమైన డిమాండ్లు వస్తాయన్న ఉద్దేశంతో ప్రభుత్వం నిర్వాసితులకు ఎక్స్‌గ్రేషియో రూపంలో పరిహారం అందించిందని స్పష్టం చేశారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత వంశధార ప్రాజెక్టులో 94 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. నేరడి బ్యారేజీకి అడ్డంకులు ఉన్నందునే ఒకవైపు సైడ్‌వియర్ కాలువ నిర్మాణంతో పాటు మరోవైపు హిరమండలం వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటి ద్వారా ఎన్ని టిఎంసిలు నీళ్లు వస్తాయో, ఎన్ని ఎకరాల స్థిరీకరణ జరుగుతుందో చంద్రబాబుకు అవగాహన లేనట్లు ఉందని చెప్పారు. వంశధార, నాగావళి అనుసంధాన పనులు 80 శాతం మేర అయ్యాయని, మరో నాలుగైదు నెలల్లో పూర్తవుతాయని చెప్పారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిపై చంద్రబాబు మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. వైఎస్ హయాంలోనే సుజల స్రవంతి ప్రతిపాదన జరిగిందని చెప్పారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.17వేల కోట్లతో మొదటి ప్యాకేజి పనులకు అనుమతులిచ్చామని, ఎల్ఎ, సర్వే, టెండర్లు కూడా పూర్తయ్యాయని తెలిపారు. రెండో ప్యాకేజీలో డిజైన్, ఎల్ఎ పూర్తయిందని, త్వరలో టెండర్ల ప్రక్రియ మొదలు పెట్టనున్నామని చెప్పారు. టిడిపి హయాంలో సోలార్ పవర్‌ను యూనిట్‌కు రూ.5.80 కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారని, ఒప్పందాన్ని రద్దు చేస్తే కోర్టుకు వెళ్లారని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పెద్ద వ్యాపారి అని పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. పార్టీని చంద్రబాబుకు అమ్మేసి, కార్యకర్తల నమ్మకాన్ని తాకట్టు పెట్టింది పవన్ కళ్యాణే అని విమర్శించారు. చంద్రబాబు ఏది చెప్తే పవన్ చేస్తున్నారని, కట్టుబానిసగా మారారని చెప్పారు. మూడు రోజులుగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలు చూస్తే విశాఖ రాజధానిని వెనక్కి నెట్టేసే కుట్ర కనిపిస్తోందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు అంధవరపు సూరిబాబు, శిమ్మ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

ప్రజలను మభ్యపెట్టే మాటలు : కృష్ణదాస్

వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు మళ్లీ మాటల గారడీతో ప్రజల్ని మభ్యపెట్టే వ్యూహంతో వచ్చారని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శ్రీకాకుళం నగరంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు జరిగే ముందు ప్రతిసారీ ఇలాగే ప్రజలను వంచించడం చంద్రబాబుకు అలవాటు అని వ్యాఖ్యానించారు. జిల్లా రైతాంగంపై మాటల్లోనే అంత ప్రేమ ఒలకబోస్తున్న చంద్రబాబు తాను అధికారంలో ఉన్నప్పుడు వంశధారను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు ప్రారంభించింది ఎవరో చంద్రబాబు మరచిపోయారన్నారు. రూ.వేల కోట్లతో జిల్లాలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులు ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

జిల్లాలో 67 బీచ్‌ల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో సిఆర్‌జెడ్ ప్రాంతాన్ని పక్కాగా గుర్తించి పర్యాటక అభివృద్ధికి ఇబ్బందుల్లేకుండా చూడాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నూతనంగా గుర్తించిన 67 బీచ్‌లు, కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్లాన్ చేర్చడానికి కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యాటక మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మ్యాపులను రూపొందించే ముందు సిఆర్‌జెడ్ ప్రాంతాన్ని పక్కాగా గుర్తించాలని సూచించారు. సముద్ర ప్రాంతానికి కిలోమీటరు దూరంగా ఉన్న ప్రభుత్వ భూముల్లో పర్యాటక అభివృద్ధికి చేపట్టనున్న ప్రాజెక్టుపై విశదీకరించాలని సూచించారు. సముద్రతీర ప్రాంతాల్లో చేపల ఉత్పత్తి, మత్స్యకారుల జీవనోపాధికి ఇబ్బంది లేని రీతిలో పర్యావరణ అనుకూల బీచ్‌లను తీర్చిదిద్దాలన్నారు. ఫిషరీస్ విశ్వవిద్యాలయం, పర్యాటక, మత్స్యశాఖలతో కూడిన 11 ప్రత్యేక బృందాలు తీరం వెంట సర్వే నిర్వహించి బీచ్‌ల అభివృద్ధికి అవకాశమున్న ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో కోస్టల్ పేరిట మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఆర్ఒ మురళీకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనురాధ, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, పలు హోటళ్ల ఎమ్‌డిలు సువ్వారి సతీష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసులతోనే బాల్య వివాహాలకు అడ్డుకట్ట

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కె.అప్పారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలను నిరోధించేందుకు మహిళా పోలీసులు కీలకపాత్ర పోషించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు గెడ్డం ఉమ అన్నారు. నగరంలోని మహిళా డిగ్రీ కళాశాలలోని సమావేశ మందిరంలో బ్రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన 150 గ్రామాల మహిళా సంక్షేమ కార్యదర్శులు, సిబ్బందికి బాల్య వివాహాలను నిర్మూలనపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహిస్తున్న వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలన్నారు.

మహిళా సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాలు, కిశోర బాలికలు, యువత, వాలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పురోహితులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. సచివాలయాల్లో బాలల చట్టాలపై పోస్టర్లను ప్రదర్శించాలని తెలిపారు. సమావేశంలో దిశ డిఎస్‌పి వాసుదేవ్, బాలల సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి, సభ్యులు గన్నెప్పుడు, డిసిపిఒ రమణమూర్తి, బ్రెడ్స్ ప్రతినిధి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రణాళికలు

ప్రజాశక్తి - బూర్జ

ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని రామన్నపేటలో సుమారు రూ.35 లక్షలతో మర్రిపాడులో సుమారు రూ.23 లక్షలతో, కొత్తలక్కుపురంలో సుమారు రూ.24 లక్షలతో, పాలవలసలో సుమారు రూ.66 లక్షలతో జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోను సర్వమత గ్రంథాలుగా భావించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనపై ప్రజల్లో విశ్వసనీయత చెక్కు చెదరలేదన్నారు. నాలుగేళ్లుగా దేశానికే రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రంలో పాలన సాగుతోందని చెప్పారు. కుల, మత, ప్రాంతీయ విభేదాలకు తావులేకుండా అవినీతి రహిత, పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ దేశానికే తలమానికంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కర్నేన దీప, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, టిడ్కో రాష్ట్ర డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు గుమ్మడి రాంబాబు, డిసిసిబి డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టెండర్ నోటీసు

విషయం:- ఇచ్ఛాపురం పురపాలక సంఘములో జనరల్,నాన్ ప్లాన్ మరియు 15వ ఆర్థిక సంఘ నిదుల పనుల గూర్చి టెండర్లు **ఇ-ప్రొకుర్మెంట్** ద్వారా ఈ క్రింది విదముగా పిలువబడుచున్నవి.

1. టెండరు నోటీసు నెం. 65/2017-18/ఇ1, తేదీ: 11.08.2023

మొత్తము పనుల సంఖ్య	-	3 (జనరల్ నిధులు)
అంచనా విలువ రూ.	-	2.40 లక్షలు
మొత్తం పనులు సంఖ్య	-	12 (15వ ఆర్థిక సంఘం)
అంచనా విలువ రూ.	-	110.64 లక్షలు
మొత్తం పనులు సంఖ్య	-	1(నాన్ ప్లాన్ గ్రాంట్)
అంచనా విలువ రూ.	-	12.93 లక్షలు
బిడ్ డోన్ లోడింగు ప్రారంభం	-	తేదీ 14-08-2023 ది సాయంత్రం 5 గంటలకు.
బిడ్ క్లోజింగ్	-	తేదీ 29-08-2023 ది సాయంత్రం 3 గంటలకు వరకు.
బిడ్ రిసీవ్ ఆఖరు	-	తేదీ 29-08-2023 ది సాయంత్రం 4 గంటలకు వరకు.
బిడ్ ప్రెస్ ఒపినింగ్	-	తేదీ 29-08-2023 ది సాయంత్రం 5 గంటలకు వరకు.

మిగిలిన వివరములకు **https:www.e-procurement.gov.in** నందు చూడగలరు. మరియు ఫోన్ నెంబర్లు 08947-231176 మరియు సెల్ : 9642023152.

సం/- కమీషనరు, ఇచ్ఛాపురం పురపాలక సంఘం

పర్యావరణ పరిరక్షణకు కృషి

పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

మణిపూర్ ఘటన నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి- పలాస

మణిపూర్ రాష్ట్రంలో ఘటన రోజురోజుకూ దాహనకాండంగా మారిందని, మణిపూర్ ఘటనకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కార్యదర్శి పుప్పు దుర్యోధన, జిల్లా అధ్యక్షులు డి.నారాయణమూర్తిలు డిమాండ్ చేశారు. మండలంలోని బొడ్డపాడులో అమరవీరుల స్మారక మందిరం వద్ద ప్రగతి శీల కార్మిక సమాఖ్య ఆధ్వర్యాన మణిపూర్ దమనకాండను ఖండిస్తూ శుక్రవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో రెండు తెగల మధ్య జరుగుతున్న దారుణాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలన్నారు. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ బాధ్యత వహించి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పథకం ప్రకారం మెయితీలను ఎస్‌టి జాబితాలో చేర్చి ఆదివాసీ చట్టాలను సవరించి దేశ సంపదను అదానీ, అంబానీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకే ఇటువంటి దారుణాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిషా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి.శ్రీరాములు, ఆర్.గుణవంతు, తామాడ తిలోచన, యంపల్లి జోగారావు, మద్దిల ధర్మారావు, కారి పురుషోత్తం, అందాల కోటేశ్వరరావు, బి.సింహాద్రి, బత్తిన వాసుదేవరావు, వంకల సర్వేషులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- జలుమూరు

పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు అన్నారు. మండలంలోని యలమంచిలిలో నా భూమి-నా దేశం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఎంపిపి వాన గోపి మాట్లాడుతూ మన దేశ రక్షణకు ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను మరువలేమన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, మండల సంఘాల సమాఖ్య పైడి విశ్వేశ్వరరావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు దామ మన్మథరావు, చల్లవానిపేట పిఏసిఎస్ అధ్యక్షుడు పోగోటి రాజప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ ధర్మాన జగన్మోహనరావు, ఎంపిడిఒ ఎల్.వి.అప్పారావు, ఎపిఒ పట్ట సోమేశ్వరరావు పాల్గొన్నారు.

నేల తల్లికి వందనం

నందిగాం : మండలంలోని బడగాం, గొల్లమూరు, కవుతెంబూరు పంచాయతీలో ఆజాదీకా మహోత్సవంలో భాగంగా సర్పంచ్‌లు కూన శాంతారావు, పోలాకి మోహనరావు, జీరు రాజేశ్వరిలు 'నా భూమి-నా దేశం, నేల తల్లికి వందనం, వీరులకు నమస్కారం' అనే కార్యక్రమం నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపీనాథ్, చంద్రశేఖరరావు, రోణంకి ఢిల్లీశ్వరరావు, ఫీల్డ్‌అసిస్టెంట్ కూన వాసుదేవరావు, బలగ భీమారావు, వెంకటరమణ, ఆర్.శ్రీను, పద్మనాభం పాల్గొన్నారు.

ప్రకృతితో మమేకమవ్వాలి

కవిటి: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, సమాజంలోని ప్రతి వ్యక్తీ ప్రకృతితో మమేకమవ్వాలని తహశీల్దార్ పి.శేఖర్, ఎంపిడిఒ పి.సూర్యనారాయణరెడ్డి అన్నారు. మన భూమి-మన దేశంలో భాగంగా స్థానిక ఉషోదయ సంఘం ఆధ్వర్యాన మొక్కలు నాటారు. కార్యక్రమంలోఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు పాండవ శేఖర్, డిటి రామచంద్రరావు, మాజీ సర్పంచ్ ఆరింగి మధు, ఉషోదయ యువజన సంఘం ఉపాధ్యక్షుడు హరి, కార్యదర్శి పులకల వెంకటరావు, విఆర్‌ఒ నారాయణ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : మండలంలోని కొయ్యాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'నా భూమి - నా దేశం'లో భాగంగా ఆవరణలో ప్రిన్సిపాల్ కీర్తి తవిటినాయుడు మొక్కలను నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి జీరు అయ్యప్పరెడ్డి, ఎంపిటిసి మజ్జి జగదీష్, ఇప్పిలి నర్సింహమూర్తి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురంలో సర్పంచ్ నర్తు వరప్రసాదరావు అధ్యక్షతన 'నా భూమి-నాదేశం'లో భాగంగా ఎమ్మెల్సీ నర్తు రామారావు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్రయాదవ్, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ , వైస్ ఎంపిపి దువ్వు వివేకానందరెడ్డి, ఎంపిటిసి ప్రతినిధి నర్తు ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలంలోని పలు పంచాయితీల్లో నా భూమి- నా దేశం కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహించారు. ఇజ్జువరం పంచాయతీలో సర్పంచ్ బొడ్డేపల్లి లావణ్య, కార్యదర్శి ఉమాపతి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎపిఒ వాసునాయుడు, వైసిపి నాయకులు వజ్జ గోపాలకృష్ణ పాల్గొన్నారు. నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ ప్రతినిధి పిలక రవికుమార్‌రెడ్డి, కోటపాడులో ఎంపిడిఒ సిహెచ్.ప్రేమలత, ఎంపిటిసి ప్రతినిధి కోత సతీష్, కార్యదర్శి కూన వాసవి ఆధ్వర్యాన శిలాఫలాకాలు ఆవిష్కరించారు.

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి పశువైద్యశాల ఆవరణలో 'నా భూమి-నా దేశం'లో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, మండల పరిషత్ ఉపాధ్యాక్షుడు బోయిన నాగేశ్వరరావు, సర్పంచ్ కాళ్ల సంజీవరావు ఉపాది . హామీ క్లస్టర్ జెఇ జి.హరిప్రసాద్ పాల్గొన్నారు. అలాగే చీపుర్లపాడు పంచాయతీలో యర్రబంద చెరువు వద్ద సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు, అప్పలస్వామి, ఎంపిటిసి అప్పన్నలు, టిసి రాంబాబు నామట్టి- నాదేశంలో భాగంగా మొక్కలు నాటారు.

జి.సిగడాం : మండలంలోని మధుపాంలో అజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా సర్పంచ్ బి.అప్పల నాయుడు మొక్కలను నాటారు. అనంతరం మధుపాం తరుపున నెహ్రూ యువ కేంద్రానికి మట్టిని పంపించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్లి తవిటినాయుడు, ఎపిడి లోకేష్, ఎపిఒ సత్యనారాయణ, టిఎ సతీష్, ఎఫ్ఎ పోతయ్య, నెహ్రూ యువ కేంద్రం బ్లాక్ వాలంటీర్లు చందన, రవీంద్ర, కామర్స్ నాగరాజు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని కుంటిభద్ర జిల్లా పరిషత్, బలద పాఠశాలల ఆవరణలో నా భూమి - నా దేశంలో భాగంగా నియోజకవర్గ నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు మొక్కలను నాటారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, ఎపిఒ ప్రేమలత, సర్పంచ్ ఎస్.కోటేశ్వరరావు, సారిపల్లి భారతి, అగముడి రంజిత్ కుమార్, ఎ.నాగేశ్వరరావు,హెచ్ఎం కృష్ణవేణి పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని లోలుగులో జాతీయ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యాన ఆజాదీకా అమృత్ మహోత్సవం వేడుకల్లో భాగంగా నాభూమి-నాదేశం, నేలతల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమాన్ని సర్పంచ్ లోలుగు ధనలక్ష్మి నిర్వహించారు. శిలాఫలకం ఏర్పాటు చేసి మొక్కలను నాటారు. అనంతరం గ్రామానికి చెందిన అమరవీరులు మజ్జి వెంకటరమణ తండ్రి మజ్జి చిన్నవాడును సత్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఎపిఒ ఆర్.శ్రీనివాసరావు, ఎంపిటిసి లోలుగు లక్షుంనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని తోటాడ పంచాయతీలో నా భూమి -నాదేశం - నేత తల్లికి నమస్కారం - వీరులకు వందనం కార్యక్రమాన్ని సర్పంచ్ యార్నాగుల సునీత అధ్యక్షతన నిర్వహించారు. స్మృతివనంలో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి యర్ణనాగుల రామరాజు, మోహనరావు పాల్గొన్నారు

జలుమూరు : శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డ్వామా పీడీ చిట్టిరాజు

నౌపడ : మట్టిని సేకరించిన నాయకులు

కవిటి : మొక్కను నాటుతున్న తహశీల్దార్ శేఖర్

ఎచ్చెర్ల : శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ తవిటినాయుడు

మొక్కను నాటుతున్న నాయకులు

ప్రకృతిని కాపాడుకుందాం

ప్రజావక్తి- కోటబొమ్మాళి

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి ప్రకృతిని కాపాడుకుందామని, మనతరం, మనతరువాత తరం రాబోయే రోజుల్లో సంతోషంగా జీవనం సాగించాలంటే ప్రతిఒక్కరూ ఆవకాశం ఉన్న చోట మొక్కలు నాటాలని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావులు అన్నారు. కోటబొమ్మాళి ఎల్‌ఐసి ఆధ్వర్యాన వృక్షో రక్షితి రక్షిత కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యవరణ పరిరక్షణకు, వాతవరణ సమతుల్యతకు మొక్కలు నాటడం అవశ్యమన్నారు. మొక్కలు నాటడమే కాకుండా నాటిన ప్రతి మొక్క జీవించే విధంగా పెంచాలన్నారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, సింగుపురం వినోద్, పూజారి లక్ష్మణరావు, ఇఒపిఆర్‌డి తులా రాజారావు, ఉపాధిహామీ క్లస్టర్ జెఇ జి.హరిప్రసాద్, ఎల్‌ఐసి బ్రాంచ్ మేనేజర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఈ నెల 12న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తరోడ్డు ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాలు, తీగలు మారుస్తామని అన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమదాలవలస రూరల్ సెక్షన్ పరిధిలోని రాగోలు సబ్ స్టేషన్ పరిధిలోని కొత్తరోడ్డు, గోపీనగర్, తోటాడ, అక్కివరం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

జి.సిగడాం : జి సిగడాం రైల్వే క్రాసింగ్ కేబుల్ మార్పు, మరమ్మతులు వల్ల శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీరింగ్ జి.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. అలాగే జి.సిగడాం సబ్ స్టేషన్ పరిధిలోని బాతువ, జి.కంచరాం, ఎందువ, నడిమివలస, సేతుభీమవరం, రామచంద్రపురం, వెలగాడ, దేవరవలస, చెట్టిపోదిలాం, కప్పరం, మధుపాం, నిద్దాం, గొబ్బురు తదితర గ్రామాల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలియజేశారు. వినియోగదారులు సహకరించాలని శ్రీకాకుళం విద్యుత్ ఇంజినీర్ బయ్యంనాయుడు కోరారు.

రేపు పలాస-కాశీబుగ్గలో...

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి అనంతపురం 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు నిమిత్తం ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కాశీబుగ్గ విద్యుత్ ఎఇ నాగభూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గ పరిధిలోని రామకృష్ణాపురం, జగనన్న కాలనీ, ఇంగిలిగాం, జిఎంఇ, ఇండస్ట్రీయల్ ఏరియా, శ్రీనివాస్‌నగర్, నెహ్రూనగర్, రోటరీనగర్, ఎంపిడిఒ కార్యాలయం, పాతజాతీయ రహదారి, పూజారవీధి, చినబాడాం, నర్సిపురం, రైల్వేగేటు డౌన్, పెసరపాడు, అంతరగుడ్డ, తాళ్లభద్ర, పద్మనాభపురం, పద్మనాభపురం కాలనీ, అంబుసోలి, నీలాపురం, జయరామచంద్రపురం, నెమలి, నారాయణపురం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి నెమలినారాయణపురం జాతీయ రహదారిపై శుక్రవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కంచిలి మండలం పురుషోత్తపురానికి చెందిన పందిరి బాసుదేవరావు (60) అక్కడికక్కడే మృతి చెందారు. కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాసుదేవరావు మతిస్థిమితం లేకపోవడంతో కంచిలి మండలం పురుషోత్తపురం వద్ద టీ తాగుకుంటూ జాతీయ రహదారిపై నడుచుకుంటూ వస్తున్నాడు. నెమలినారాయణపురం జాతీయ రహదారి వద్ద గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలాన్ని కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య చంద్రమ్మ, కుమారుడు భువనేశ్వరరావులు ఉన్నారు. హెచ్‌సి సీతారాం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు 'ఫ్యాప్టో' 12 గంటల నిరసన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులతోపాటు విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 12న ఫ్యాప్టో సంఘాల ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద తలపెట్టిన 12 గంటల నిరసన దీక్షను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల విద్యారంగం సంక్షోభంలో పడిందని అన్నారు. ప్రభుత్వం అమలు చేసిన జాతీయ విద్యా విధానం, 3,4,5 తరగతుల విలీనంతో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేక తరగతి గదులు వెలవెలబోతున్నాయన్నారు. పాఠశాల విద్యాశాఖను పరిరక్షించాల్సిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను వేదింపులకు గురి చేస్తున్నారని అన్నారు.


వ్యాన్‌పైకి ఎక్కి కోళ్లను తీసుకుంటున్న జనం

కోళ్ల వ్యాన్ బోల్తా
పట్టుకుపోయిన జనం

పొందూరు: మండలంలోని రాపాక కూడలి నుంచి శ్రీకాకుళం వెళ్లే రహదారిలో పిల్లలవలస కూడలి వద్ద శుక్రవారం వేకువజామున కోళ్లవ్యాన్ బోల్తా పడింది. శ్రీకాకుళం నుంచి పొందూరు వైపు వస్తున్న ఈ వ్యాన్ కూడలిలోని మలుపు వద్ద అదుపు తప్పడంతో రహదారి పక్కన కాలువలోకి పడిపోయింది. ఆ సమయంలో అటుగా వెళ్తున్న వాహనదారులు దీనిని గమనించి సమీప గ్రామాల వారికి సమాచారం అందించారు. దీంతో జనం పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. దీంతో ఒక్కసారిగా ఎగబడి ఎవరికి దొరికిన కోళ్లను వాళ్ల పట్టుకుపోయారు. ఈ వాహనం ఒడిశా నుంచి వస్తున్నట్లుగా చెబుతున్నారు. ఈ సంఘటనతో రూ.5 లక్షలు వరకూ నష్టం వాటిల్లినట్లు భావిస్తున్నారు.

అప్పన్నను సన్మానిస్తున్న గ్రామస్తులు

అప్పన్న సేవలు మరువలేనివి

సంతబొమ్మాళి : మండలంలోని మేఘ వరం పంచాయతీ సూరాడవానిపేట లో పనిచేసిన ఉపాధ్యాయుడు మెండ అప్పన్న సేవలు మరువలేనివని విద్యార్థులు తల్లిదండ్రులు కమిటీ చైర్మన్ సూరాడ జోగారావు అన్నారు. సూరాడవానిపేట ప్రాథమిక పాఠశాలలో ఎనిమిదేళ్ల పాటు పనిచేసి ఇటీవల జగన్నాథపురం పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అప్పన్నకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మూల రవికుమార్, ఉపాధ్యాయులు దుర్గారావు, పిల్లయంపల్ల చెంచయ్య, మత్స్యకార నాయకుడు సూరాడ ధనరాజ, గ్రామ పెద్ద బైపల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.

కొత్తూరు : సంతకాలను సేకరిస్తున్న అప్పన్న

టెక్కలి రూరల్ : సంతకాలను సేకరిస్తున్న నాయకులు

జీడి మద్దతు ధరకు సంతకాల సేకరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

జీడీకి మద్దతు ధర కల్పంచాలని లక్ష సంతకాల సేకరణ చేపడుతున్నామని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.వాసు,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.ఎల్లయ్య అన్నారు. మండలంలోని టెక్కలి మండలం బెండకాయలపేటలో శుక్రవారం సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో గిరిజన జీడి రైతులు డి.నీలవేణి, సిహెచ్.జమ్మయ్య, అప్పారావు, భాగ్యవతి పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని గిరిజన పంచాయతీ గొట్టిపల్లిలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మక అప్పన్న ఆధ్వర్యాన జీడికి మద్దతు ధరకు సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడి రైతుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. 80 కేజీల బస్తాకు రూ.16 వేలు మద్దతు కల్పించి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. జీడీ పంట భద్రతకు ఉచితంగా టార్పాలిన్లు పంపిణీ చేయాలన్నారు. జీడి మొక్కలను ఉచితంగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో గేదెల అనిల్ కుమార్, చిన్నారావు, అరిక గణపతి, శివ, రవి, అరిక తవితయ్య పాల్గొన్నారు.

టిడిపితోనే మహిళలకు రక్షణ

లావేరు: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంతోనే మహిళలకు రక్షణ ఉంటుందని తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి ముప్పిడి సుజాత అన్నారు. మండలంలోని బుడుమురులో టిడిపి మేనిఫెస్టోలో ప్రకటించిన మహాశక్తి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విధానాలతో ప్రస్తుతం అన్ని తరగతుల ప్రజలు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన అంతా అస్తవ్యస్తంగా ఉందన్నారు. చంద్రబాబు మహిళలకు ఆర్థికంగా, సామాజికంగా, రాయజకీయంగా చైతన్యవంతులను చేశారని చెప్పారు. కార్యక్రమంలో విజయనగరం పార్లమెంట్ అధికార ప్రతినిధి గంట సంధ్య, గజపతిరావు, మహిళలు పాల్గొన్నారు.

పోస్టర్‌ను అందజేస్తున్న సుజాత

నేడు ఎర్రన్న విద్యాసంకల్పం పుస్తకాల పంపిణీ

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని ప్రతిభ కలిగిన విద్యార్థులు పోటీ పరీక్షల్లో మరింత రాణించేలా ప్రోత్సాహించేందుకు చేపట్టిన ఎర్రన్న విద్యా సంకల్పం కార్యక్రమంలో శనివారం పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందజేస్తున్నామని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని హోటల్ గ్రాండ్‌లో ఉదయం 9 గంటలకు ఆమదాలవలస, శ్రీకాకుళం, నరసన్నపేట నియోజకవర్గాల నుంచి ఎంపికైన వారికి పంపిణీ చేస్తామని అన్నారు. అలగే సాయంత్రం 3 గంటలకు టెక్కలి ఆదిత్య కళ్యాణ మండపంలో టెక్కలి, పాతపట్నం, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల వారికి అందజేస్తామని తెలిపారు.

ఘనంగా పోలారావు జయంతి

దుస్తులను అందజేస్తున్న నాయకులు

ఇచ్ఛాపురం : కీర్తిశేషులు పిలక పోలారావు పురపాలక సంఘ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని జెడ్పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మున్సిపాలిటీ పరిధి బెల్లుపడలో పోలారావు విగ్రహం వద్ద 68వ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరి హృదయాలను దోచుకున్న నాయకులు పోలారావు అన్నారు. అదేబాటలో చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి నడుస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యాలక్ష్మి మాట్లాడుతూ ఇలాంటి ముఖ్య నేతకు తను వారసురాలిగా ఉండడం గర్వంగా ఉందన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు రాజ్యలక్ష్మి, పిలక సంతోష్, కుటుంబ సభ్యులు చేతుల మీదుగా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్, ఎంపిపి బోర పుష్ప, కంచిలి ఎంపిపి పైల దేవదాస్‌రెడ్డి, జెడ్‌పిటిసి ప్రతినిధి ఉప్పాడ రాజారెడ్డి, సోంపేట జెడ్‌పిటిసి ప్రతినిధి తడక జోగరావు, కౌన్సిలర్లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

లావేరు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలు, మెళకువలను అందించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఎంతో మేలు చేస్తుందని తామాడ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జి.డానియల్ పేర్కొన్నారు. తామాడ ఆదర్శ పాఠశాలలో మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 211 మంది ఉపాధ్యాయులకు ఐఎఫ్‌పి (ఇంటరేక్టివ్ ప్లాట్ పేనల్) బోర్డు పేరిట శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్సు కో-ఆర్డినేటర్ ఇంజరాపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయుల ప్రతిభ మరింత మెరుగుపడుతుందన్నారు. ముఖ్యంగా తరగతి గదిలో విద్యార్థుల ఏకాగ్రత, పాఠ్యాంశాలపై శ్రద్ధ పెట్టేలా సులభతరంగా బోధించేందుకు ఈ శిక్షణ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. శిక్షణా కార్యక్రమం ఈ నెల 8 ప్రారంభించి శుక్రవారం నాటితో పూర్తి స్థాయిలో విజయవంతమైందని అన్నారు. కార్యక్రమంలో డిఆర్‌పిలు వి.శ్రీనివాసరావు, జి.రూబెన్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని పెద్దమడి ప్రభుత్వ గిరిజన బాలికల సంక్షేమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు రెండు విడత నిర్వహించిన శిక్షణా తరగతులు ముగిశాయి. ఈ సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్, కోర్సు డైరక్టరు తమ్మినేని శారద పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని అన్నారు. డిఆర్‌పి ఎస్ వి.ఎల్.నరసింహులు నాలుగు రోజుల పాటు అవగాహనా తరగతులు నిర్వహించారని చెప్పారు.

మెళియాపుట్టి : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శారద

14న ఇంటర్వ్యూ

శ్రీకాకుళం అర్బన్ : సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న మందస బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో ఖాళీగా ఉన్న టిజిపి ఫిజికల్ సైన్స్ (ఇంగ్లీషు) మీడియంలో బోధించడనికి ఈ నెల 14న వాకిన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు జిల్లా సమన్వయాధికారి ఎన్.బాలాజీనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కో-ఆర్డినేటర్, ఎపిఎస్‌డబ్ల్యూఆర్ ఇఐ సొసైటీ, ఆదివారంపేట, శ్రీకాకుళం కార్యాలయంలో హాజరు కావాలన్నారు. ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు తమ బయోడేటా, పిజి, బిఇడి, టెట్, అనుభవ ధ్రువపత్రాలు జత జిరాక్స్ కాపీలు, ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు వివరాలకు 08942 279926, 9701736862, 9000314209 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

తాగునీరు వృథా

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మేజరు పంచాయతీ వైశ్యవీధిలో కుళాయి ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు వృథాగా పోతోంది. వీధిలో వేసిన కుళాయిలకు టాప్‌లు వేయకపోవడంతో నీటిని విడిచిపెట్టినప్పుడు ఇలా వృథాగా పోతుంది. దీంతో వీధి మొత్తం బురదమవుతుంది. ఈ విషయం సంబంధిత కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదని వాసులు విమర్శించారు. అలాగే పలు కాలనీల్లో డ్రెయినేజీలో మురుగునీరు బయటకు వెళ్లకపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు.


వృథా అవుతున్న తాగునీరు

సంకల్పయాత్రను నిర్వహిస్తున్న తేజేశ్వరరావు

సంకల్పయాత్ర ప్రారంభం

మెళియాపుట్టి : పాతపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధికి పాటుపడుతున్న వారిని ఆదరించాలని విద్యావేత్త సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. మండలంలోని ఆకులమ్మ ఆలయం వద్ద పాతపట్నం సమగ్ర అభివృద్ధి సంకల్పయాత్రను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలస, వారసత్వ రాజకీయాలకు స్వస్తి పలకాలన్నారు. నియోజకవర్గంపై విషయ పరిజ్ఞానం తెలిసిన వారికి చోటు కల్పించాలన్నారు. స్వార్థ రాజకీయాల వల్ల పాతపట్నం నియోజకవర్గం వెనుకబడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వలస, వారసత్వ రాజకీయాలపై తెలియజేయడానికి ఈ సంకల్పయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. అధికంగా గిరిజనులు ఉన్న ఈ మండలంలో ఐటిడిఎ లేకపోవడం బాధాకరమని అన్నారు. గిరిజన యువతకు ఉపాధి కల్పించే నాయకులకు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సరాలి సర్పంచ్ పడాల షణ్ముఖరావు, మాజీ సర్పంచ్ పడాల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: చెక్కును అందజేస్తున్న నాయకులు

సోంపేట : చెక్కును అందజేస్తున్న ఎంపిపి దాస్

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

ఇచ్ఛాపురం : మహిళ్యా సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ అన్నారు. మండలంలోని ఈదుపురం రైతు భరోసా కేంద్రం వద్ద సర్పంచ్ నర్తు వరప్రసాద్ అధ్యక్షతన సున్నా వడ్డీ నమూనా చెక్కును శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్, వెలుగు ఎపిఎం ప్రసాదరావు, కె.మోహనరావు, నర్తు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

సోంపేట: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిదే అని ఎంపిపి ఎన్.దాసు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం విడుదల చేసిన సున్నా వడ్డీ నమూనా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, ఆర్.ప్రేమ, పి.కామేష్, బి.ధర్మ, ఎం.వెంకటరమణ, పి.లోకనాథం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఫ్లెక్సీల ధ్వంసం

ప్రజాశక్తి- కవిటి

ఎమ్మెల్యే బెందాళం అశోక్ పుట్టినరోజు సందర్భంగా మండలంలోని కొజ్జిరియా, ప్రగడపుట్టుగ జంక్షన్, కొత్తూరు గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ రామయ్యపుట్టుగలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం టిడిపి మండల అధ్యక్షుడు మణిచంద్ర ప్రకాష్, సీపాన వెంకటరమణ విలేకరులతో మాట్లాడారు. ఫ్లెక్సీలు చించి పైశాచిక ఆనందం పొందడం అనేది ఇంతవరకు మండలంలో జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు వచ్చిన అభిమానులను చూసి ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయని అన్నారు. ఇటువంటి కవ్వింపు చర్యలు ఎన్ని చేసినా తాము భయపడమని హెచ్చరించారు. ఈ సంఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు బెందాలం రమేష్, పుల్లట సంతోష్, బాసుదేవ్ రౌలో, కడియాల వెంకటరావు, బొడ్డ రామ్ కుమార్ పాల్గొన్నారు.

టిడిపి నాయకుల ఆగ్రహం

కవిటిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను దుండగులు ధ్వంసం చేయడంపై నియోజకవర్గ టిడిపి నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో ఇటువంటి సంస్కృతి మంచిది కాదని అన్నారు. మేమూ ఇలాగే వ్యవహరిస్తే నియోజకవర్గంలో భయానక పరిస్థితులు నెలకొంటాయని అన్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేసి నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాళ్ల జైదేవ్, పూనా సంతోష్, జన్నెల సంతోష్, సాలిన జగదీష్, పైల నారాయణ పాల్గొన్నారు.

ధ్వంసం చేసిన ఫ్లెక్సీలు

నందిగాం : మాట్లాడుతున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

'ఈ-క్రాప్ నమోదు వేగవంతం

ప్రజాశక్తి- నందిగాం

ఖరీఫ్ సీజన్‌లో ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల ఛైర్మన్ శ్యామసుందరరావు అధ్యక్షతన మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రైతులకు ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయిలో ఈ-క్రాప్ నమోదు సకాలంలో చేపట్టాలని సూచించారు. వంశధార నీరు శివారు ప్రాంతాలకు అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌బికెల ద్వారా డిఎపి, యూరియా రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఎంపిడిఒ జి.శివప్రసాద్, తహశీల్దార్ వై.వి.పద్మావతి, మండల ఎఒ శ్రీకాంత్ వర్మ, వంశధార జెఇ అభిషేక్ పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని రైతులందరికీ ఈ-క్రాప్ నమోదుకు చేయాలని ఎంపిపి ఎన్.దాస్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా నెలవారి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్న పరిస్థితుల్లో రైతులకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు సూచించాలని అన్నారు. తహశీల్దార్ సత్యనారాయణ సాగు పత్రాల ప్రాముఖ్యత గురించి వివరించారు. పశువులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని పశు వైద్యాధికారి చైతన్య సూచించారు. సమావేశంలో నీటిపారుదల, విద్యుత్, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

సోంపేట : మాట్లాడుతున్న ఎంపిపి దాసు

ఆలయ సన్నిధిలో సౌజన్య

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : ఆహా ఓటిటిలో ప్రసారమయ్యే తెలుగు ఇండియన్ ఐడల్-2లో విజేతగా నిలిచిన సౌజన్య భాగవతుల శుక్రవారం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆమెకు అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతించారు. స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం ఆమెకు అర్చకులు ఆశీర్వచనం అందించారు.

చెత్తా చెదారంతో నిండిన కాలువ

అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ

చోద్యం చూస్తున్న అధికారులు

కోటబొమ్మాళి: మండల కేంద్రమైన కోటబొమ్మాళిలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ముఖ్యంగా రెడ్డిక వీధి, కరణాల వీధి, హడ్కో కాలనీ, పెద్ద పొందరవీధిలతో పాటు పంచాయతీ కార్యాలయం రోడ్డులో ఏ డ్రెయినేజీ చూసినా మురుకుతో దర్శనమిస్తున్నాయి. డ్రెయినేజీలు తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతూ ఇంత అస్తవ్యస్తంగా ఉన్నా పంచాయతీ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు ధ్వజమెత్తుతున్నారు. ఈ అపారిశుద్ధ్యం కారణంగా రోజురోజుకూ దోమల ఉధృతి ఎక్కువవుతుందని ప్రజలు వాపోతున్నారు. పరిస్థితి ఇలానే ఉంటే తాము రోగాల బారిన పడతాం భయమని అంటున్నారు. నెలల తరబడి ఒకేచోట మురుగు నిలిచిపోవడం వల్ల భరించలేనంత దుర్వాసన వెదజల్లుతోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లలోకి సైతం దుర్గంధం వెదజల్లుతోందని ఎన్నిసార్లు అధికారులకు సమస్యపై మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలలో డ్రెయినేజీలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయని, పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదని విమర్శించారు. ప్రజారోగ్యంపై అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని, ఇలాగే మరి కొన్ని రోజులు డ్రెయినేజీ వ్యవస్థ ఉంటే ప్రజలు రోగాలు బారిన పడకతప్పదని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరవాలన్నారు. ప్రస్తుత పంచాయతీ అధికారులు పారిశుధ్యాన్ని పట్టించుకోవడంతో మురుగు, చెత్తాచెదారంతో డ్రెయినేజీలు నిండిపోయాయన్నారు. దీంతో దోమల ఉధృతి రోజురోజుకు అధికమవుతోందని, పిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడతామేమోనని భయమేస్తోంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని, డ్రెయినేజీలను పరిశుభ్రం చేసేందుకు కృషి చేయాలని కాలనీ వాసులు కోరారు.

విత్తనాల నాణ్యతపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న శరత్‌బాబు

ఆమదాలవలస విత్తనాల నాణ్యతను మెరుగుపరచడానికి, రైతుల ఆదాయాన్ని పెంచడానికి విత్తన ఉత్పత్తి, మార్కెటింగ్‌లో నేషనల్ సీడ్ కార్పొరేషన్ లిమిటెడ్ పాల్గొంటుందని ఎన్ఎస్‌సి అసిస్టెంట్ మేనేజర్ బి.శరత్ బాబు అన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నేషనల్ సీడ్ కార్పొరేషన్ (భారత ప్రభుత్వ రంగ సంస్థ) రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు, క్రియాశీల రైతులకు శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ లిమిటెడ్ అనేది వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ పరిపాలన నియంత్రణలో ఉన్న భారత ప్రభుత్వ సంస్థల్లో ఒకటని అన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా విత్తన ఉత్పత్తి చేసేందుకు ఉన్న నియమ నిబంధనల గురించి వివరించారు. అలాగే నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ రైతు ఉత్పత్తిదారుల సంఘాల అనుసంధానం గురించి అవగాహన కల్పించారు. కెవికె శాస్త్రవేత్త డాక్టర్ సీపాన నీలవేణి మాట్లాడుతూ పంట కోత అనంతరం విత్తనం కీటకాలు, ఎలుకల బారిన పడకుండా ఎక్కువ కాలం నిలువ చేసుకునే మేలుకోవలను జాగ్రత్తలను వివరించారు. ఎపిఇడిఎ ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తులు ఎగుమతులు ఎలా చేసుకోవాలనే అంశంపై విత్తనాలు పురుగు మందులు, ఫెర్టిలైజర్ లైసెన్సులు ఎలా పొందాలనే దానిపై కల్పించారు. కార్యక్రమంలో నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ రీజనల్ మేనేజర్ బ్రిట్టో, ఎపిఇడిఎ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్.పి.నాయుడు, ఎడిఎ భవానీశంకర్, రైతు ఉత్పత్తిదారుల సంఘాల రైతుల ప్రతినిధులు పాల్గొన్నారు.

పొలం గట్లపై బహుళ పంటల సాగు

ఆమదాలవలస : మండలంలోని ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా సిబ్బంది వరి సాగు చేసే పొలం గట్లపై పలు రకాల కూరగాయలు సాగు చేపట్టారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్ సాగు చేస్తున్న వరి పొలం గట్లపై పలు రకాల కూరగాయలు, బొప్పాయి, అరటి, కొబ్బరి, మునగ మొక్కలను శుక్రవారం నాటారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో బహుళ పంటలు సాగు వల్ల అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని అన్నారు. చేపేనపేట యూనిట్ పరిధిలో వరిసాగు చేస్తున్న రైతుల పొలం గట్లపై కూరగాయల వేసుకుని సాగు చేసేలా మా సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని అన్నారు.

కూరగాయల మొక్కను నాటుతున్న రైతు

నేడు పుస్తకావిష్కరణ

పలాస : ఆజాదీకా అమృత్ మహోత్సవ్ భాగంగా శనివారం కాశీబుగ్గ ప్రయివేట్ కళ్యాణ మండపంలో కుత్తుం తాతారావు సాహిత్య సాంస్కృతిక కళాపీఠం ఆధ్వర్యాన స్వాతంత్ర్యోద్యమంలో సిక్కోలు వీరులు అనే పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు మాకన్నపల్లికి చెందిన రచయిత కుత్తుం వినోద్ కుమార్ తెలిపారు. అతిథులుగా మంత్రి అప్పలరాజు, జుత్తు తాతారావు, పుస్తక పరిచయకర్త ఆచార్య లీలాప్రసాద్‌లు హాజరవుతారని అన్నారు.

వికలాంగుల శిబిరం విజయవంతం

సదరం పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పలాస : వికలాంగులు, వయోవృద్ధులు బహుళ ప్రయోజన గుర్తింపు శిబిరాన్ని ఎంపిడిఒ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరానికి పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల నుంచి 169 మంది తరలివచ్చి దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎడి కవితకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం, అలిమికో సంస్థ సంయుక్తంగా వికలాంగులకు పరికరాలు పంపిణీ చేసేందుకే ఈ శిబిరాలు నిర్వహించామని తెలిపారు. వికలాంగుల అవసరాలను బట్టి ఆ సంస్థల వైద్యులు నిర్ధారించి త్వరలో పరికరాలు పంపిణీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్‌నాయుడు, ఇఒపిఆర్‌డి మెట్ట వైకుంఠరావు, మండల పరిషత్ కార్యాలయం అధికారులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసనాయుడు

'స్వచ్ఛ మురపాక' సాధనే ధ్యేయం

ప్రజాశక్తి- లావేరు

స్వచ్ఛ మురపాక గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సచివాలయం కన్వీనర్ బాలి శ్రీనివాసనాయుడు, వైసిపి నాయకులు పెయ్యల లక్ష్మణరావు, తేనెల విద్యాసాగర్ అన్నారు. కార్యదర్శి కె.వి.ప్రసాద్‌తో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికీ చెత్త సేకరణ వాహనాన్ని పంపించి చెత్తను సేకరించి సంపద కేంద్రానికి తరలిస్తున్నామని అన్నారు. పరిశుభ్రత పరంగా మురపాకను ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా డబ్బాలు వేసి వాహనదారులకు అందజేయాలన్నారు. దీని కోసం ప్రజలు, వర్తకులు సహకరించాలని కోరారు.

ప్రచారం చేస్తున్న దువ్వాడ వాణి

వెంకటేశ్వర కాలనీలో గడప గడపకు...

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడానికి గడపగడపకు ఎంతో ఉపయోగపడుతుందని నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి అన్నారు. టెక్కలి-1 గ్రామ సచివాలయ పరిధిలో వెంకటేశ్వర కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఆట్ల సరోజినమ్మ, పిఎసిఎస్ ఛైర్మన్ సత్తారు సత్యం, ఎంపిటిసి యర్ర అనంతయ్య పాల్గొన్నారు.

నేడు రెడ్డిపేటలో స్పీకర్ పర్యటన

పొందూరు: మండలంలోని దళ్ళిపేట పంచాయతీ రెడ్డిపేటలో శనివారం నిర్వహించనున్న గడపగడపకు మన ప్రభుత్వం, ఇంటింటికీ కుళాయిల శంకుస్థాపనలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పాల్గొననున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 3 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

నగదును అందజేస్తున్న సర్పంచ్ అప్పన్న

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని పాలతలగాం పంచాయతీ నమ్మి చిన్నారావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. మృతుడి భార్యకు వైఎస్ఆర్ బీమా కింద తక్షణ సాయంగా రూ.పది వేలు సర్పంచ్ నక్కిట్ల అప్పన్న చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి అట్టాడ అప్పలనాయుడు, కార్యదర్శి కర్రి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.